క్లుప్తంగా

ఎల్ఎస్‌సీఎస్ రికార్డుల పరిశీలన

పర్చూరు(చినగంజాం): అడుసుమల్లి ఎల్ఎస్‌సీఎస్‌లో గణాంకాలకు సంబంధించి అధికారులు రికార్డుల పరిశీలన నిర్వహించారు. నెల్లూరు నుంచి వచ్చిన సీనియర్ అధికారి గురువారం రికార్డులను తనిఖీ చేసినట్లు బాపట్ల జిల్లా కోఆపరేటివ్ అధికారి శ్యాంసన్ తెలియజేశారు. సహకార సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోలు బంకు ఇటీవల మూసి వేయడంతో సమీక్షించినట్లు వివరించారు.

చీరాల్లో భారీ వర్షం

చీరాల: చీరాల్లో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. గంటపాటు పిడుగులు, మెరుపులతో కురిసిన వర్షానికి చీరాల పట్టణంలోని పలు ప్రధాన రహదారులపై వర్షపునీరు నిలిచి పోయింది. రాత్రి సమయంలో వాతావరణం మారి ఈదురుగాలులు వీచాయి. ఒక్కసారిగా భారీ వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది. దర్బార్ రోడ్డు, గడియార స్తంభం, మసీదు సెంటర్, పేరాల మార్కెట్, కూరగాయల మార్కెట్ ఏరియాలో రోడ్లపై వర్షపు నీరు నిలిచింది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వేటపాలెం: మండల పరిధిలోని చల్లారెడ్డిపాలెం పరిధిలోని విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని రూరల్ ఏఈ భాస్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తపేట ప్రసాద్‌నగర్, చల్లారెడ్డిపాలెం అక్కాయిపాలెం, లక్ష్మీపురం, కటారివారి పాలెం, పొట్టిసుబ్బయ్యపాలెం, కొత్తపాలెం గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

చీరాల టౌన్: గ్రామంలో సీజనల్ వ్యాధులకు గురికాకుండా ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేస్తున్నామని ప్రజలంతా వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఈపురుపాలెం పంచాయతీ సెక్రటరీ మురళీ బాపూజీ సూచించారు. శుక్రవారం గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని గాంధీపార్కు సెంటర్, సావరపాలెం, 40 ఇండ్లకాలనీ, పద్మనాభునిపేట, సీతారాంపేట, ఇందిరానగర్‌కాలనీ ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించారు.

ఆరోగ్యానికి సొగసు మనసే..

పర్చూరు(చినగంజాం): వ్యక్తి మనసే ఆరోగ్యానికి అసలైన సొగసు అని ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో డాక్టర్ దాసరి చంద్రశేఖర్ సూచించారు. చెరుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇన్‌చార్జ్ వైద్యాధికారి, ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ శుక్రవారం ప్రపంచ మానసిక దినోత్సవం సందర్భంగా అవగాహన కల్పించారు. జీవనశైలి వల్ల మనసుకి ఎన్నోరకాల వ్యాధులు వస్తున్నాయని, ఆటిజం, ఏడీహెచ్‌డీ ఎక్కువగా వస్తాయని తెలిపారు. రెండేళ్ల లోపు పిల్లలకు సెల్‌ఫోన్ ఇవ్వవద్దన్నారు. హెచ్ఈఓ సత్యనారాయణ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వ్యసనాలతో జీవితాలు నాశనం

చీరాల రూరల్: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్. విజయమ్మ పేర్కొన్నారు. టొబాకో ఫ్రీ యూత్ క్యాంపెయిన్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో ఆరోగ్య సిబ్బందితో ప్లకార్డులు ప్రదర్శించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. యువతి, యువకులు పొగాకు ఇతర మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, పొగాకు ఉత్పత్తులను సేవించడం ద్వారా నోటి క్యాన్సర్ వ్యాప్తి చెందుతుందని చెప్పారు. పొగాకు ఉత్పత్తులను సేవించకుండా యువతలో చైతన్యం తీసుకురావటానికి ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అలానే పొగాకు రహిత పట్టణ, గ్రామాలుగా తీర్చిదిద్దే దిశగా ప్రతి ఒక్కరూ తోడ్పాటునందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ సీహెచ్ రత్న మన్మోహన్, జిల్లా పొగాకు నియంత్రణ అధికారి బి. రమేష్, హెల్త్ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కూలీలందరికీ ఉపాధి పనులు కల్పిస్తాం

చీరాల టౌన్: వలసలను నిర్మూలించి కూలీలందరికీ ఉపాధి కల్పించేందుకు పంచాయతీల్లో నిర్వహిస్తున్న గ్రామ సభల్లో ఉపాధి పనులను పెంచి ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పిస్తామని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ దాసు పేర్కొన్నారు. శుక్రవారం తోటవారిపాలెం, పిట్టువారిపాలెం గ్రామ పంచాయతీలో సచివాలయాల అడ్మిన్లు, డిజిటల్ అసిస్టెంట్లతో కలిసి ఉపాధి పనుల సంఖ్య పెంపుదలపై సమావేశాన్ని నిర్వహించారు. ఏపీఓ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో కూలీ పనులకు వెళ్లే ప్రతి ఒక్కరికీ ఉపాధి అందించేందుకు రూపొందించిన ఉపాధి హామీ పథకంలో పనులు ఎక్కువగా గుర్తించి కూలీలకు పనులు కల్పించాలన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో కలిసి అన్ని గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి ప్రజలకు అవసరమైన ప్రతి పనిని రికార్డు చేసి పనుల సంఖ్యలు పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. పంచాయతీ కార్యదర్శులు, ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డు అసిస్టెంట్లు, సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

సీట్లు ఫుల్.. పురుషులు నిల్!


బస్సు కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు


బస్టాండ్ ప్రాంగణంలోనే బస్సు ఎక్కేందుకు సిద్ధమవుతున్న మహిళలు

- కిక్కిరిసిపోతున్న స్త్రీశక్తి బస్సులు
- సీట్లు కోసం సిగపట్లు
- అదనపు సర్వీసులు ఏర్పాటుకు కసరత్తు

చీరాల: ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చిన చందాన స్త్రీ శక్తి పథకం అమలుతో బస్సుల్లో సాధారణ ప్రయాణికుల కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో ఆర్టీసీ బస్సులు కిక్కిరిసిపోతున్నాయి. రద్దీగా ఉండే రూట్లలో సరిపడా సర్వీసులు ఉన్నా ప్రయాణికుల తాకిడితో బస్సులు సరిపోవడం లేదు. బస్సు ప్లాట్‌ఫాంపైకి వచ్చి ఆగకముందే సీట్లు కోసం యుద్ధాలు చేస్తున్నారు. నిమిషాల్లోనే బస్సు పూర్తిగా నిండిపోతోంది. వృద్ధులు, పిల్లలతో బస్సు ఎక్కాలంటే ఒక సాహసంగా మారింది.

పరిస్థితి ఇలా..

జిల్లాలో చీరాల, బాపట్ల, రేపల్లె, అద్దంకి నియోజకవర్గాల్లో ఆర్టీసీ డిపోలున్నాయి. వీటిలో మొత్తం 253 బస్సులు సేవలు అందిస్తున్నాయి. కాగా స్త్రీశక్తి పథకం కోసం ఏకంగా 212 సర్వీసులు కేటాయించారు. అలానే నాలుగు డిపోల్లో పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు 100 వరకు అద్దె బస్సులు నడుస్తున్నాయి. చీరాల డిపోలో నరసరావుపేట, విజయవాడ, ఒంగోలు రూట్లు ఎప్పుడూ రద్దీగా ఉంటాయి. విజయవాడ, ఒంగోలు రూట్లలో ఎక్స్‌ప్రెస్ బస్సులు నడుస్తున్నాయి. ఒంగోలు, నరసరావుపేట రూట్లకు పల్లెవెలుగు బస్సులు నడుస్తున్నాయి. ఆదాయం, రద్దీగా ఉండే ఒంగోలు, విజయవాడ రూట్లలో ఎక్స్‌ప్రెస్ బస్సులు ఎక్కువగా ఉండడంతో ఉచిత ప్రయాణికుల తాకిడి ఎక్కువైంది.

మగాళ్ల కష్టం ఇలా..

ఒక వైపు బస్సుల కొరత మరో వైపు కిక్కిరిపోయిన బస్సుల కారణంగా పురుషులు ప్రయాణించేందుకు ప్రతి రోజు నానా కష్టాలు పడుతున్నారు. పలు మార్గాల్లో బస్సులు తక్కువగా ఉండటం బస్సుల్లో ప్రయాణించే వారిలో మహిళలే అధికంగా ఉండటంతో బస్సులు కిక్కిరిపోతున్నాయి. బస్సులో సీటింగ్ కెపాసిటీ 56 ఉంటే 80 మందికి పైగా బస్సులో ప్రయాణిస్తున్నారు. బస్సు బస్టాండ్ దాటిన తర్వాత వచ్చే స్టాంపుల్లో బస్సు ఎక్కాలంటే ఖాళీ లేక ప్రయాణికులు బస్సులు ఎక్కడం లేదు. బస్టాండ్‌లో ఎక్కిన వారికి మాత్రమే సీట్లు ఉంటున్నాయి. బస్సు ఆగిన వెంటనే కిటికిలో నుంచే కర్చీఫ్‌లు, బ్యాగులు వేసుకొని సీట్లు దక్కించుకుంటున్నారు. బస్సులు ప్రయాణికులతో నిండిపోవడంతో మిగిలిన స్టాప్‌లలో బస్సులు ఆగడం లేదు. బస్సులో 30 శాతం మాత్రమే పురుషులు ఉంటుండగా మిగిలిన 70శాతం మంది మహిళలే ఉంటున్నారు. ఒకప్పుడు బస్సులో స్త్రీలకు ప్రత్యేకంగా సీట్లు కేటాయించేవారు. ప్రస్తుతం ఉచిత బస్సు ప్రయాణం కారణంగా ఎక్కువ శాతం మహిళలే సీట్లలో కూర్చోవడంతో పురుష ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.


బస్సులో సీట్ల కోసం ప్రయాణికుల ఫీట్లు

ఇబ్బందులు పడుతున్న కండక్టర్లు...

బస్టాండ్‌లో బస్సు ప్రారంభంలోనే సీట్లు అన్ని ఫుల్‌గా మారడంతో దారి పొడవునా ఎక్కే ప్రయాణికులతో బస్సులు కిక్కిరిసిపోతున్నాయి. మహిళలకు బస్సు ప్రయాణం ఉచితమైనా ఆధార్ కార్డు చూపించి ఫ్రీ టిక్కెట్ తీసుకోవాలి. అయితే ఆధార్ కార్డు చూసి టిక్కెట్ ఇవ్వాలంటే పెరిగిన రద్దీతో కండక్టర్లు కూడా గతంలో కంటే ప్రస్తుతం ఇబ్బందులు పడుతున్నారు. విడి రోజుల్లో ఎలాగున్నా పండుగల సీజన్‌లలో మాత్రం రద్దీ ఎక్కువగా ఉంటోంది. బస్సులు ఆలస్యం అయితే ప్రయాణికులతో బస్టాండ్ ప్రాంగణాలు కిటకిటలాడుతున్నాయి.

పోరు బాటే రైతాంగానికి దిద్దుబాట


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు వలేటి కృష్ణయ్య

మార్టూరు: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయం పట్ల అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరితో రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారని పోరాటంతోనే సమస్యలు పరిష్కరించుకోగలమని రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు వలేటి కృష్ణయ్య పిలుపునిచ్చారు. రైతు సంఘం మార్టూరు మండల మూడో రైతు మహాసభ సందర్భంగా స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో రైతులతో మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడం కోసం కోటి ఎకరాల భూమిని ఎంపిక చేయగా అందుకు రాష్ట్ర ప్రభుత్వాలు వంత పాడుతున్నాయని విమర్శించారు. అదానీ, అంబానీల వంటి కార్పొరేట్లకు ఐదు లక్షల ఎకరాలు కట్టబెట్టడం ద్వారా చిన్న, సన్న కారు రైతులు లేకుండా చేయడమే లక్ష్యంగా మోదీ ఆలోచిస్తున్నారని ఆయన విమర్శించారు. గత ప్రభుత్వంలో విద్యుత్ స్మార్ట్ మీటర్లను ధ్వంసం చేయమని రైతులకు పిలుపునిచ్చిన ప్రస్తుత రాష్ట్ర మంత్రి నారా లోకేష్ వాటిని ఎందుకు స్వాగతిస్తున్నారో రైతులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తాము కరేడు గ్రామంలో రెండు రోజులు రహస్యంగా ఉండి రైతులతో మాట్లాడామని అసలు పరిశ్రమ కోసం 200 ఎకరాలు సేకరిస్తున్నామని చెప్పిన ప్రభుత్వం 8,600 ఎకరాలకు నోటిఫికేషన్ ఇవ్వటంలో గల మతలబు ఏమిటో చంద్రబాబు ప్రభుత్వం సమాధానం చెప్పాలని కృష్ణయ్య నిలదీశారు. కార్మిక, కర్షక వర్గాలు సమైక్యంగా నిలబడి పోరాటం ద్వారానే రైతాంగ సమస్యలు పరిష్కరించుకోగలమని ఆయన పిలుపునిచ్చారు. మూడో మహానాడు సందర్భంగా ఉదయం స్థానిక విశ్రాంత ఉద్యోగుల కార్యాలయంలో ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. మార్టూరు మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం రెవెన్యూ సమస్యల పరిష్కారం, ఎరువులు విత్తనాలు సకాలంలో అందజేయడం, స్వామినాథన్ కమిటీ సిఫార్సుల అమలు, పంటల బీమా కచ్చితంగా అమలు చేయడం వంటి ఆరు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. మార్టూరు జాతీయ రహదారిపై బైక్ ర్యాలీ ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా, మండల నాయకులు పేర్ని నాగేశ్వరరావు, కందిమళ్ల రామకోటేశ్వరరావు, పాలెపు సాంబశివరావు, వి.కృష్ణమూర్తి, బత్తుల హనుమంతరావు, వై. రాంబాబు, మోహన్ రావు, అంకమ్మ చౌదరి, శ్రీనివాసరావు, ఐలవరపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


కూకట్లపల్లిలో మండల ఉపాధ్యక్షుడుతో అశోక్ కుమార్

బల్లికురవ: కూటమి ప్రభుత్వం వైఫల్యాలను గ్రామాల వారీగా ప్రజలకు తెలియజేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి చింతలపూడి అశోక్ కుమార్ కోరారు. శుక్రవారం రాత్రి మండలంలోని కూకట్లపల్లి గ్రామంలో మండల ఉపాధ్యక్షుడు ఇప్పల వెంకట సుబ్బారెడ్డి ఇంటికి వెళ్లి ఆయనతో మాట్లాడారు. గ్రామాల వారీగా పార్టీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకుని చేపట్టబోయే కార్యక్రమాలపై చర్చించారు. ప్రతి కార్యకర్త ఓ సైనికుడిలా పనిచేస్తూ అద్దంకిలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసి జగనన్నను గిఫ్టుగా ఇవ్వాలన్నారు. ఇందుకోసం పార్టీ కార్యకర్తలంతా ఐక్యతతో కలిసి కట్టుగా పని చేయాలని అశోక్ కుమార్ కోరారు. కార్యక్రమంలో పార్టీ బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లి అంజనీ ప్రసాదరెడ్డి, స్థానిక నేతలు కొణుదుల శంకర రెడ్డి, మేడా శివదుర్గా బాబు, బత్తుల రమేష్‌బాబు, బుర్రి ఆదినారాయణ, సురభి ప్రభాకర్, మేరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీపై కూటమి కుట్రలను తిప్పికొడతాం

- రాష్ట్ర కార్యదర్శి, నియోజక వర్గ ఇన్‌చార్జ్ గాదె మధుసూదనరెడ్డి


చినగంజాంలో బ్రహ్మానందరెడ్డి తదితరులను పరామర్శిస్తున్న ఇన్‌చార్జ్ మధుసూదనరెడ్డి

చినగంజాం: వైఎస్సార్ సీపీ కేడర్‌పై కూటమి ప్రభుత్వం జరుపుతున్న కుట్రలను చట్టబద్ధంగా తిప్పికొడతామని రాష్ట్ర కార్యదర్శి, నియోజక వర్గ ఇన్‌చార్జ్ గాదె మధుసూదనరెడ్డి అన్నారు. చినగంజాం మండలంలో ఇటీవల దిష్టిబొమ్మ తగులబెట్టారంటూ అక్రమంగా కేసులు బనాయించి కోర్టుకు పంపించిన ఆసోది బ్రహ్మానందరెడ్డి, మరో 17 మంది బాధితులను పరామర్శించేందుకు ఆయన శుక్రవారం చినగంజాం విచ్చేశారు. బ్రహ్మానందరెడ్డి స్వగృహంలో కార్యకర్తలను కలిసిన ఆయన వారిని ఓదార్చారు. కూటమి ప్రభుత్వం వైఎస్సార్ సీపీని , నాయకులను, కార్యకర్తలను ప్రజాక్షేత్రంలో ఎదుర్కొన లేక కుయుక్తులు పన్నుతూ ప్రతి చిన్న విషయాన్ని పెద్దదిగా చేసి చూపుతూ అధికారులను తమ చెప్పుచేతల్లో పెట్టుకుంటోందన్నారు. సంబంధం లేని సెక్షన్లు బనాయిస్తూ శిక్షలకు గురిచేస్తున్నారన్నారు. కూటమి చేతిలో అధికారం ఉండటంతో అధికారులను కీలుబొమ్మలను చేసి ఆడిస్తోందని, ముఖ్యంగా పోలీస్ శాఖాధికారులు తమ ఉద్యోగ భద్రత కోసం వారి చెప్పినట్లుగా తు.చ తప్పకుండా నెరవేరుస్తున్నారని ఆరోపించారు. అధికారులు తప్పని సరి పరిస్థితుల్లో కూటమి నాయకుల చెప్పుచేతల్లో ఉంటూ ఎదుటి వారి భవిష్యత్, కుటుంబాల గురించి ఆలోచించే స్థితిలో లేరని విమర్శించారు. కూటమి ప్రభుత్వ ఆగడాలకు బలవుతున్న ప్రతి ఒక్క కార్యకర్తకి వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని, ఆపదలో ఆదుకుంటుందని, ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బండారు ప్రభాకరరావు, మైలా చిననాగేశ్వరరావు, యు. అనిల్ చౌదరి, ఎస్. వేణు, బండి రామయ్య, జయపాల్, మోషే, వెంకయ్య, అడకా గంగయ్య, బుజ్జి నాయక్, అంజిబాబు, రమేష్, ఖాదర్ బాషా, ఉల్లాస్ గాంధీ, మహ్మద్, అక్కల రామకృష్ణారెడ్డి, రవీంద్రరెడ్డి, గోపిరెడ్డి, హేమంత్ కుమార్ రెడ్డి, సుభాని, ఇసూబ్, షాకీర్, రఘు, అమరా సురేష్ పాల్గొన్నారు.

మెటీరియల్ సద్వినియోగం చేసుకోండి


విద్యార్థులకు మెటీరియల్‌ను అందజేస్తున్న యూటీఎఫ్, జేవీవీ ఉపాధ్యాయులు

పర్చూరు(చినగంజాం): విద్యార్థులు మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకొని మెరిట్ సాధించాలని చెరుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం టి. బెంజిమన్ హనోక్ అన్నారు. నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు సంబంధించిన మెటీరియల్‌ను అందజేశారు. జన విజ్ఞాన వేదిక ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన మెంటల్ ఎబిలిటీ టెస్ట్ మెటీరియల్‌ను చెరుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం టీ బెంజిమన్ హనోక్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు సాంబశివరావు, మాధవరావు, మస్తాన్‌వలి, శ్రీనివాసరావు, కపూర్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్‌లో దేశాయిపేట విద్యార్థుల ప్రతిభ


కప్పుతో గెలుపొందిన విద్యార్థులు

వేటపాలెం: డివిజన్ స్థాయి ఆటల పోటీల్లో దేశాయిపేట జిల్లా పరిషత్ విద్యార్థులు వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరచి ప్రథమ స్థానం సాధించినట్లు ప్రధానోపాధ్యాయురాలు డి. విజయలక్ష్మి శుక్రవారం తెలిపారు. మార్టూరు మండలం కొలకలపూడి జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో 69వ డివిజన్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ పోటీలు జరుగుతున్నాయని.. క్రీడాకారులు ప్రతిభ కనబరచి ప్రథమ స్థానం సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయులు ఆర్. శివయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

సమాజంలో లింగ వివక్ష సిగ్గు చేటు


చినగంజాం: మాట్లాడుతున్న సీడీపీఓ సులోచనా రాణి


ఇసుక దర్శిలో మాట్లాడుతున్న సీడీపీఓ సుభద్ర


కలెక్టర్ చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న విద్యార్థి మణిదీపిక


బల్లికురవలో బహుమతులు అందజేస్తున్న సూపర్‌వైజర్, ఎంఈవో


కారంచేడులో బాలికా దినోత్సవంలో ప్రసంగిస్తున్న విద్యార్థిని

మార్టూరు: అతివలు అంతరిక్షంలోకి అవలీలగా వెళ్లి వస్తున్న నేటి ఆధునిక సమాజంలో పురుషాధిపత్యం , స్త్రీ పురుషుల మధ్య లింగ వివక్ష వల్ల సభ్య సమాజం సిగ్గుపడాల్సి వస్తోందని ఐసీడీఎస్ పర్చూరు ప్రాజెక్ట్ సీడీపీఓ సుభద్ర పిలుపునిచ్చారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ఇసుక దర్శి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో మహిళా స్వావలంబన గురించి ఆమె మాట్లాడారు. అనంతరం స్థానిక వడ్డెర కాలనీ అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ మహా కార్యక్రమంలో అవగాహన కల్పించి వారిచే ప్రతిజ్ఞ చేయించారు.

చినగంజాం: బాలికలు వ్యక్తిగత శుభ్రత పాటించాలని అంగన్‌వాడీ ఇంకొల్లు ప్రాజెక్ట్ సీడీపీఓ జి. సులోచన రాణి అన్నారు. రాజుబంగారు పాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. హెచ్ఎం ఆర్. శ్రీనివాస రెడ్డి, పెదగంజాం సెక్టార్ సూపర్ వైజర్ కె. వాణిశ్రీ, అనిత పాల్గొన్నారు. బాలికలు అన్ని రంగాలపై అవగాహన కలిగి ఉండాలని కస్తూర్బా బాలికా విద్యాలయం ప్రిన్సిపాల్ సుమాంజలి అన్నారు. అడివీధిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల, చినగంజాం కస్తూర్బా బాలికా విద్యాలయం పరిధిలో నిర్వహించారు. సైబర్ క్రైమ్, లింగ సమానత్వం, బాల్యవివాహాలు, బాలికల రక్షణ, పోషకాహారంపై అవగాహన కల్పించారు. వ్యాసరచన పోటీలు, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. సూపర్ వైజర్ ఎస్. సుమలత, టీచర్ ఆశాజ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలికలను తీర్చిదిద్దడమే ధ్యేయం

బల్లికురవ: బాలికలను విద్యతోపాటు అన్ని రంగాల్లో అత్యుత్తములుగా తీర్చిదిద్దటమే ధ్యేయమని ఎంఈఓ ఏ. రమేష్ బాబు అన్నారు. శుక్రవారం బల్లికురవలో అంతర్జాతీయ బాలికాదినోత్సవం వేడుకలను ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల వల్ల దుష్ప్రభావాలు విద్య ఆవశ్యకతను వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మీరాబి, ఉపాధ్యాయుడు డెవిడ్ పాల్, సునీత, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

కారంచేడు: బాలికా దినోత్సవం పురస్కరించుకొని మండల కేంద్రమైన కారంచేడు యార్లగడ్డ నాయుడమ్మ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. శుక్రవారం ఐసీడీఎస్ కారంచేడు సెక్టార్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలో బాలికల వ్యక్తిత్వ వికాసంపై చర్చించారు. నేటి సమాజంలో ఎదురవుతున్న అనేక సమస్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, ఐసీడీఎస్ నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

జె.పంగులూరు: అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా సేవ్ ది గర్ల్, చైల్డ్ అనే అంశంపై జిల్లా స్థాయి వక్తృత్వ పోటీలు బాపట్లలో జరిగాయి. ఈ పోటీలకు చందలూరు విద్యార్థిని అమ్మిశెట్టి మణిదీపిక పాల్గొని జిల్లా స్థాయిలో మూడో స్థానం గెలుచుకొని కలెక్టర్ చేతుల మీదగా శుక్రవారం బహుమతి అందుకుంది. పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు శ్రీమతి గిరిజ, ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందిచారు.

వాడవాడలా పూజలు


కొణిదెనలో అలంకరణలో గణపతి

బల్లికురవ: సకల దేవతలకు అధిపతి అయిన గణపతిని ఆరాధిస్తే అవిఘ్నాలన్నీ తొలగిపోతాయని ఆలయల అర్చకులు స్వర్ణ రాంబాబు శర్మ, ఇంకోల్లు సుధీర్ శర్మ, అద్దంకి నాగ బ్రహ్మాచారి శుక్రవారం సంకష్టహర చతుర్థి సందర్భంగా బల్లికురవ, కొణిదెన, నక్కబొక్కలపాడు, కొండాయపాలెం, చెన్నుపల్లి, ముక్తేశ్వరం, సూరేపల్లి, చిన అంబడిపూడి గ్రామంలో గణపతికి పంచామృతాలతో అభిషేకం ప్రత్యేక అలంకరణ చేపట్టారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన ఉండాలి

పర్చూరు(చినగంజాం): ప్రభుత్వం వివిధ వస్తువులపై తగ్గించిన సేవా పన్నుపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీఓ వి. ప్రద్యుమ్నకుమార్ అన్నారు. శుక్రవారం పర్చూరులో జీఎస్టీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మొబైల్, సెల్‌ఫోన్, ఎలక్ట్రికల్, గృహోపకరణాలు వస్తువులపై జీఎస్టీ తగ్గిందని వివరించారు. తగ్గిన జీఎస్టీల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ కె. సత్యనారాయణ, ఎంఈఓ 2 వెంకటరామయ్య, పంచాయతీ కార్యదర్శి మస్తాన్‌రావు పాల్గొన్నారు.


జీఎస్టీ తగ్గింపుపై వివరిస్తున్న అధికారులు

వర్మీకంపోస్టు తయారీపై అవగాహన

మేదరమెట్ల: వానపాముల ఎరువు (వర్మికంపోస్టు) తయారీ విధానం గురించి కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల మార్కెట్‌యార్డులో ఆత్మ ఆధ్వర్యంలో శుక్రవారం రైతులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏవో రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పశువుల వ్యర్థాలు పంటల అవశేషాలను వినియోగించుకొని తక్కువ ఖర్చుతో వర్మికంపోస్టు ఎలా తయారు చేసుకోవచ్చో వివరించారు.

అద్దంకి రూరల్: ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో అధిక ఆదాయం సాధ్యమని బాపట్ల జిల్లా ప్రాజెక్టు మేనేజర్ హుస్సేన్ అన్నారు. శుక్రవారం మండలంలోని చిన కొత్తపల్లి గ్రామంలో గోఆధారిత వ్యవసాయ వనరుల కేంద్రం ప్రారంభించారు. అద్దంకి సహాయ వ్యవసాయ సంచాలకులు బి. ఎర్రాయం. మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకట కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

జె.పంగులూరు: రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి, ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మగ్గు చూపి మంచి లాభాలు పొందాలని ఏవో సుబ్బారెడ్డి అన్నారు. మండల పరిధిలోని రామకూరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయం పై ఆత్మ ఒంగోలు వారు శుక్రవారం రైతులు అవగాహన కల్పించారు. వ్యవసాయ సహాయకుడు హరి, ఆత్మ ఏటీఎం అక్షరరాణి, సీఆర్‌పీఎస్ రమేష్ పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు


సూచనలిస్తున్న ఎంపీడీఓ ప్రద్యుమ్నకుమార్

పర్చూరు(చినగంజాం): ప్రభుత్వం నిర్దేశించిన పని పట్ల అలసత్వం వహిస్తే సచివాలయ సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవని ఎంపీడీఓ వి. ప్రద్యుమ్నకుమార్ హెచ్చరించారు. శుక్రవారం వెలుగు కార్యాలయంలోని సమావేశ భవనంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ కొంత మంది ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు అప్పగించిన పని పూర్తి చేయకుండా సమయం గడుపుతున్నారని పంచాయతీ కార్యదర్శులు వారి చేత అప్పగించిన పనులను పూర్తి చేయించాలన్నారు. పనిచేయించే బాధ్యత కూడా పంచాయతీ కార్యదర్శులదేనన్నారు. ప్రభుత్వం ఇచ్చిన సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని అతిక్రమించినవారిపై చర్యలు తీసుకొని విధుల నుంచి తొలగించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కె. సత్యనారాయణ, సమిత్వ సర్వేపై అవగాహన కల్పించారు.

పొదుపు గ్రూపులు అభివృద్ధి చెందేలా కృషి చేయండి

చీరాల టౌన్: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అందిస్తున్న రుణాలను పొదుపు మహిళలు సక్రమంగా వినియోగించుకునేలా వీఏవోలు చర్యలు తీసుకోవాలని ఏపీఎం పి.మధు సూచించారు. శుక్రవారం బుర్లవారిపాలెంలోని స్త్రీశక్తి భవనంలో ఐకేపీ మండల సమాఖ్య ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ పొదుపు సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని, వివిధ వ్యాపారాలు, సూక్ష్మ పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్న సభ్యుల జీవనోపాదిని పెంచేలా పొదుపు సంఘాల ఏపీఎంలు చర్యలు చేపట్టాలన్నారు. పొదుపు గ్రూపుల వివరాలు ఆర్థిక ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. ప్రతి గ్రూపు విధిగా మొక్కలు నాటి సంరక్షణ చేయాలన్నారు. ప్రతి గ్రూపు తీసుకున్న రుణాలను కేవలం స్వయం సహకారం పెంపొందించుకునే సంస్థలను ఏర్పాటు చేసుకుని అభివృద్ధి సాధించాలన్నారు. గ్రామ సంఘాలు ప్రతినెలా సమావేశాలను నిర్వహించుకొని సంఘం అభివృద్ధికి అధికారులు, లీడర్లు కృషి చేయాలన్నారు. మండల సమాఖ్య ప్రతినిధులు, సీసీ, సీవీలు పాల్గొన్నారు.